# జాజిమల్లి

బ్లాగ్ కథలు



మల్లీశ్వరి

"ఎన్వలప్ కవర్లూ, ఇన్లాండ్ కవర్లూ, పోస్టుకార్డులూ మోసుకొచ్చేది ఉట్టి సమాచారమేనా?... సంతోషాలూ, సంబరాలూ, విచారాలూ, విశేషాలూ కలిసి ఉత్తరం పట్టుకుంటే చాలు మనిషిని కావలించుకున్నట్టు ఉండేది.

ఇప్పటికీ మాకు బోల్డు ఉత్తరాలొస్తుంటాయి. మా అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఫ్లాట్స్ వాళ్ళ కోసం పిచ్చుక గూళ్ళ లాంటి చిన్న చిన్న పోస్టు బాక్సులు ఉన్నాయి. అందులో చెయ్యి పెడితే ఏనాడు నిరాశ పడింది లేదు.... టెలీఫోన్ బిల్లులో, క్రెడిట్ కార్డు బిల్లులో, ఎల్.ఐ.సి. నోటీసులో, బాంక్ లోన్ రిమైండర్లో... చేతికి తగిలి జీవితాన్ని అంకెల మధ్యకి విసురుతాయి. మనిషిని కావలించుకున్నట్లుండే ఉత్తరాలు పోయి డబ్బుని కావలించుకున్నట్లుండే ఉత్తరాలు వచ్చాయి."

"మంచివైతే ఎందుకు మంచివో... చెడ్డవైతే ఎందుకు చెడ్డవో... వివక్ష ఉంటే ఎక్కడ ఉందో చెప్పడానికే కాదు... మల్లీశ్వరిని అయినందుకు కూడా ఇప్పుడు నేను రాజకీయాలు మాట్లాడతాను."

-మల్లీశ్వరి

అస్తిత్వ చైతన్యాల మధ్య వైరుధ్యాలు, ఘర్షణ-ఐక్యతల పట్ల సమగ్ర శాస్త్రీయ అవగాహన లేకుండా పాక్షికంగా అర్థం చేసుకుని ఏ అస్తిత్వానికి ఆ అస్తిత్వమే సర్వస్వం, సర్వస్వతంత్రం, సమగ్రంగా భావించే పిడివాదం ప్రతికూల ఫలితాన్నిస్తుంది. కుల, మత, ప్రాంత, వర్గ, లింగ ప్రజాస్వామిక సంభాషణ, పరస్పర ప్రభావిత వైఖరి అస్తిత్వ సమస్యల పరిష్కారానికి, సమాజంలోని సమస్త పీడనలు, అసమానతలు, ఆధిపత్యాల నిర్మూలనకు అనివార్యమైన అవసరం. ఈ గుర్తింపే మల్లీశ్వరి రచనల అంతస్సూత్రం.

మహిళా ఉద్యమం సాధించుకున్న ఉద్యోగాలు, ఊళ్ళేలటాల ఆర్థిక స్వేచ్ఛా రూపం, సారంలో ఆడపిల్ల ఎక్కడయినా ఆదాయవనరు మాత్రమే కావడం, సంసారంతో సహా సమస్త జీవన సంబంధాలు, అనుబంధాలని 'టాక్‌టైమ్' నిర్దేశిస్తున్న ఆర్థిక విధ్వంసం.... ఇవన్నీ ఇందులో ఉన్నాయి.

సిద్ధంగా ఉన్న మెట్లు ఎక్కి విజయం సాధించడానికీ, మెట్టుమెట్టుగా ఒక్కొక్కటి నిర్మించుకుని ఎక్కడానికి మధ్యగల తేడాను గిరిజన విద్యార్థిని తులమ్మ నుంచి నేర్చుకున్నానన్న విషయాన్ని వినయంగా చెప్పుకున్న అధ్యాపకురాలు మల్లీశ్వరి. ఆ సంసిద్ధత, నిబద్ధత ఆమెను వాకపల్లి బాధిత స్త్రీల వద్దకు, సోంపేట, కాకరాపల్లి పోలీసు కాల్పుల ఘటనల వద్దకు నడిపించింది. ఈ ఆచరణ మమేకతే ఆమె రచనల్లోని స్పష్టత, సూటిదనం, నిజాయితీ.

యం. రత్నమాల

పది సంవత్సరాలుగా తెలుగులో నవల, కథా రచనలు చేస్తున్న మల్లీశ్వరి తెలుగు సాహిత్య విద్యార్థి. కేతు విశ్వనాథరెడ్డి కథల మీద ఎం.ఫిల్, ఓల్గా నవలల మీద పిహెచ్.డి చేశారు. అయిదు నవలలు, ఒక కథా సంపుటి ప్రచురించారు. ప్రజాస్వామిక అస్తిత్వ ఉద్యమాలపై సాహిత్యంపై ఈ రచయిత్రికి ఆసక్తి, సహానుభూతి ఉన్నాయి.

పశ్చిమ గోదావరి జిల్లాలో పుట్టి, గత ఇరవై సంవత్సరాలుగా విశాఖపట్నంలో నివసిస్తూ ఉత్తరాంధ్ర మాండలికంలోనూ రచనలు చేస్తున్నారు. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక వ్యవస్థాపక సభ్యురాలు. ప్రస్తుత కార్యదర్శి. మల్లీశ్వరి బ్లాగ్ jajimalli.wordpress.com అంతర్జాల పారకులకి సుపరిచితం. ఆదిత్య పి.జి. కళాశాల విశాఖపట్నంలో తెలుగు శాఖాధిపతిగా ఉన్నారు.



# జాజిమల్లి

బ్లాగ్ కథలు



మల్లీశ్వరి

పర్స్పెక్టివ్స్

సామాజిక శాస్త్రం / సాహిత్యం

హైదరాబాద్

2011

ISBN-978-81-905756-9-0
ప్రచురణ సంఖ్య : **42**
డిసెంబర్ 2011

**జాజిమల్లి**
(బ్లాగ్ కథలు)
**మల్లీశ్వరి**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :**
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన్‌భవన్ - బ్యాంక్‌స్ట్రీట్
హైదరాబాద్ - 500 001
ఫోన్ నెం. 040-24744580

పబ్లిషర్స్ :
**ప ర్స్పె క్టి వ్స్**
సామాజిక శాస్త్రం / సాహిత్యం
ఫ్లాట్ నెం. 305
ఇ.నెం. 2-2-647/182/ఎ3
హిమశివ అపార్ట్‌మెంట్స్
బాగ్ అంబర్‌పేట్
హైద్రాబాద్ - 500 013

₹ : **80/-**



*for* EBook : Kinige.com

బుక్ మేకింగ్ :
ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు

కవర్ డిజైన్ :
రమణజీవి

కంపోజింగ్ :
గిరివర్మ
తిరుపతి
శ్రీశ్రీ గ్రాఫిక్స్
హైదరాబాద్

ముద్రణ :
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్,
హైదరాబాద్ - 500 020



తెలియజెప్పే

మిత్రులు

**కృష్ణాబాయి**

**వర్మ**

**నారాయణవేణు**.....లకి



"మౌలికమైన మార్పుకోసం జరిగే పోరాటాల ప్రభావం సమాజం మీద కొంతమేరకు ప్రత్యక్షంగా కనిపిస్తే, ఆ మార్పు కాలక్రమంలో వివిధ వర్గాల్లో పరోక్షంగా వ్యక్తం అవుతుంటుంది. తమదైన ఒక స్పేస్ కోసం ఆ పోరాటాలు రూపుదిద్దుకుంటుంటాయి. తమకి జ్ఞాపకంగా మిగిలిందేమిటో, వర్తమానంలో తామేం కోల్పోతున్నామో తెలిసి ప్రజలు వ్యాకుల పడతారు. అప్పుడు ప్రజాస్వామిక పద్ధతుల్లోనూ, వివిధ రూపాల్లోనూ ఆ మార్పు ఫలితాలకోసం ప్రజలు ఉద్యమిస్తారు.

జాజిమల్లి కథలు 30 ఏళ్ళ క్రిందటి పశ్చిమగోదావరి జిల్లాలోని గ్రామీణ జీవితాన్ని అస్తిత్వ ఉద్యమాల కోణంనుంచి చెబుతాయి. ఆ ఊరు ఈ దేశంలో ఏ ఊరైనా కావచ్చు. అందుకే ఈ కథలకి నిర్దిష్టతతో పాటు సార్వజనీనత కూడా ఉంది. చితికిపోయిన వ్యవసాయ కుటుంబంలో నలుగురు ఆడపిల్లల్లో నాలుగో బిడ్డగా పుట్టిన మల్లీశ్వరి ఇప్పటి తన అవగాహన నుంచి ఒక క్రమంలో తన బాల్యాన్ని, జీవితాన్ని వ్యాఖ్యానిస్తారు. తనని ఆవరించిన మానవ సంబంధాలను వాటి సంక్లిష్టతలను చెబుతూనే వాటిని శాసించే రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పితృస్వామిక అణచివేతలని ఈ కథల్లో మల్లీశ్వరి చెబుతారు. మాయమైపోతున్న మనిషి గురించి, కనిపించని కుట్రలతో కన్నీరు పెట్టే పల్లె బతుకులని కూడా ఈ కథలు చెబుతాయి.

జాజిమల్లి బ్లాగ్ ఆవిష్కరించిన బతుకు చిత్రాలివి."

**ఆర్.కె.**

# బ్లాగ్ కథాక్రమం


| | | | |
|---|---|---|---|
| | ❊ పిదపకాలపు పిట్టకథలు – కె. శ్రీనివాస్ | – | IX |
| 1. | ఈ మధ్య నేను కొల్లగొట్టిన హృదయాలు | – | *15* |
| 2. | నా మాదిగ గూడెం యాత్రా విశేషాలు | – | *18* |
| 3. | నాన్న... ఓ పదమూడేళ్ళ కూతురు | – | *20* |
| 4. | తులమ్మ విజయం | – | *23* |
| 5. | ప్రిన్సిపాల్ అను ఓ వడ్డీ వ్యాపారి కథ | – | *26* |
| 6. | చిటికీసర చెట్టుకి కాసిన తియ్య మామిడి పండు | – | *28* |
| 7. | నాయనమ్మ 2010 | – | *30* |
| 8. | అనుమానం పెనుభూతం | – | *32* |
| 9. | బొమ్మ – బీటీ వంకాయ | – | *34* |
| 10. | ఇప్పుడు స్త్రీలు సాల్మన్ చేపలు కారు | – | *36* |
| 11. | ప్రేమలేఖ నేర్పిన గుణపాఠం | – | *38* |
| 12. | కురిసింది వానా... కాలేజి లోనా | – | *40* |
| 13. | మా అమ్మే తోటమాలి అయితేనా... | – | *43* |
| 14. | మా ఊళ్ళో కుక్కల పండగ | – | *46* |
| 15. | బేగం ఎంత సొగసు గత్తె! | – | *49* |
| 16. | నడి వయసు వేళ ఒళ్ళు మండి జంప్ జిలానీ | – | *51* |
| 17. | ఆనంద్ వాళ్ళ అమ్మ | – | *54* |
| 18. | అరచేతిలో అక్వాగార్డ్ | – | *57* |

19. మా అల్లరి విజ్జి కనిపించుట లేదు - 60
20. ఆమెకి చేతులు కావాలి - 63
21. మా అక్కాచెల్లెళ్ళ ఆస్తి పంపకాలు - 66
22. నాన్న చేతి కొత్తావకాయ ముద్ద రుచి... - 69
23. ఎన్టీయార్ కొడుకు పుణ్యమాని - 72
24. మా ఇంట్లో వాడుక పాలు పోసేది చంద్రబాబునాయుడు - 75
25. ప్రయివేట్ స్పేస్ - 78
26. నేను - వాళ్ళిద్దరూ - 81
27. కొత్తగా రెక్కలొచ్చెనా - 83
28. 'బానిసలకి బానిసని' అన్న చంద్రమౌళి - 86
29. నేను - మా నాన్న గారు - మహిళా దినోత్సవం - 89
30. పొలం అమ్ముకోవడమంటే - 92
31. ఇండియన్ మేకలు యూరోపియన్ గొర్రెలు - 95
32. చబాస్... కర్రి లచ్చుమ్మా! - 98
33. మనిషిని కావలించుకునే ఉత్తరం - 101
34. టాక్‌టైమ్ - 104
35. వంద అబద్ధాల సెలవుచీటీ - 108
36. మతమంటే మొగుడే కదా! - 111
37. మా అమ్మ నేర్పిన ఆర్థిక సూత్రం - 115
38. మా అమ్మ ఎపుడు అనురాధ అయ్యిందంటే... - 118
39. రిక్షా రంగదాసు - చాకలి దాలమ్మ - 122
40. పారిపోయిన తొలి యవ్వనం - 126
41. నలుగురాడపిల్లల తల్లిదండ్రులు - 129
❋ నేనెందుకు బ్లాగ్ కథలు రాసానంటే - 133

# పిదప కాలపు పిట్ట కథలు

పాతూరి పూర్ణచంద్రరావు అంటే ఎవరో మనకేమి తెలుసు? కానీ, ఆయన వాళ్ల నాలుగో అమ్మాయికి జాజి అనే ముద్దుపేరు పెట్టి, ఆ పేరుని విడమరచి కూడా చెప్పారని ఈ పుస్తకం చదివితే తెలుస్తుంది. జాబిలి వంటి చల్లదనమూ జిలేబి వంటి తియ్యదనమూ కలిసి జాజి అయిందట. ఆ జాజి అలియాస్ మల్లీశ్వరి రాసిన ఈ కథలు చల్లగా తియ్యగా మాత్రమే ఉంటాయని అనుకుంటే కొంచెమేమిటి చాలానే పొరపాటు. చేదుగా, కారంగా, పుల్లగా, వగరుగా, కోపంగా, నిర్దాక్షిణ్యంగా, నిక్కచ్చిగా, ధైర్యంగా - ఎట్లా అయినా ఉన్నాయేమో కానీ, ఈ కథలు సుకుమారంగానో మృదువుగానో మధురంగానో మాత్రం లేవు. జీవితంలాగా ముఖ్యంగా ఈ పిదపకాలపు జీవితంలాగా కన్నీటి పర్యంతంగా, వికటాట్టహాసంగా ఉన్నాయి. ఈ కథలలోని జీవన సారాంశాన్ని, విషాద తాత్పర్యాన్ని గ్రహించడం మాత్రం అంత సులువు కాదు. అనేక సౌందర్యభరిత వాక్యాలు, ఉద్వేగ వ్యక్తీకరణలు కలిగించే విభ్రమను, పారవశ్యాన్ని తప్పించుకుంటూ పాఠకులు బీభత్ససత్యాస్వాదన చేయాలి.

పూర్ణచంద్రరావుతోపాటు, అనూరాధ, నాగవల్లి, పుష్పవల్లి, విజయలక్ష్మి, నాయనమ్మ, బామ్మ, తులమ్మ, చంద్రమౌళి, బేగం, హెప్సిబా, కర్రి లచ్చుమ్మ, ఆనంద్‌వాళ్ల అమ్మ, రిక్షారంగదాసు, చాకలి దాలమ్మ, పద్దయ్య, బూబమ్మ, రాజేశ్వరి, వీరయ్య.....ఇటువంటి పేర్లెన్నో ఈ కథల్లో మనకు తారసపడతాయి. కానీ ఇవి పేర్లో పాత్రలో కాదు. జీవిస్తున్న మనుషులు. రచయిత జీవితంలోని మనుషులు. కానీ, కథలను చదివిన తరువాత వాళ్లు మన జీవితంలోని మన మనుషులతో కలిసిపోతారు. నామవాచకాలు కాస్తా సర్వనామాలైపోతాయి. వారితో ముడిపడిన అనుభవాలన్నీ మన అనుభవాలు అవుతాయి. చివరకు ఇదంతా మనకు తెలిసిందే లెమ్మని నిర్లిప్తత కలుగుతుంది. తెలిసిందాన్ని ఇట్లా చూడవచ్చునా అన్న ఆశ్చర్యం కలుగుతుంది.

అప్పుడిక అసలు సంశయం ముందుకు వస్తుంది. ఇంతకీ వీటిని కథలన వచ్చునా? నిర్వచనాలకు ఈ రచనలు ఒదుగుతాయా? మ్యూజింగ్స్‌లాగా ఉన్నట్టు అనిపిస్తోందే, గల్పికలంటూ వచ్చేవి, ఇవి అవి కాదా, మినీకథలో, కార్డు కథలో, పొట్టికథలో మునుపు ఉన్నవే కదా, వెబ్ సాహిత్యంలో ఫ్లాష్‌ఫిక్షన్ నానోఫిక్షన్ సడన్‌ఫిక్షన్ అంటూ ఏవేవో వస్తున్నాయి ఆ కోవలోవా? – ఇట్లా అనేక ప్రశ్నలు మనల్ని చుట్టుముడతాయి. ప్రక్రియాచర్చలోకి వెడితే దారితప్పే ప్రమాదం ఉంటుంది కానీ, వీటికంటూ ఒక పేరు ఉండాలి కదా? కొసమెరుపుతో ఒక సన్నివేశాన్ని రచిస్తే అది గల్పిక అన్నారు, వ్యంగ్యమో హాస్యమో ఉండాలన్నారు, నీతికూడా చెప్పాలన్నారు. కొడవటిగంటి కుటుంబరావు రాజకీయ సందేశాన్ని, సమాజ వాస్తవికతను బలంగా చెప్పడానికి కొన్ని గల్పికలు రాశారు. వినోద భరితమైన డిటెక్టివ్ గల్పికలూ రాశారు. రావిశాస్త్రి కూడా గల్పికాకారుడే. అంతటి మహామహుల దగ్గరనుంచి, జనరంజక రచయితలూ, వర్ధమానులూ ఎందరో గల్పికలను సాధన చేశారు. పత్రికలలో స్థలానికి కొరత ఏర్పడి, బుద్ధికి పనిలేకుండా కాలక్షేపం జరిగే కథలు కావలసి వచ్చినప్పుడు – మినీ కథలు ఉధృతంగా వచ్చాయి. వాటిలోనూ మేలురకం లేవని కాదు కానీ, ఒక జోక్‌ను సాగదీసి, ఒక ఆశ్చర్యపరిచే మలుపు జోడించిన చిన్న కథలే రాసులుగా కనిపిస్తాయి.

మరి మల్లీశ్వరి కూడా అటువంటిదే ఏదో పాత బాణీనే అనుసరించారా? లేదు. పాతబాటలోనే కొత్త నడకలు నడిచారు. లేదా కొత్తబాట వేసుకుని అందులో పాతనడకలు నడిచారు. అందుకని ఇదొక కొత్త ప్రక్రియ, రూపం వల్లనే కాదు సారం వల్ల కూడా. జాజిమల్లి కథల్లో ఒకే సన్నివేశం ఉన్నవి ఉన్నాయి. కొరడాకొస వంటి కొసమెరుపులూ ఉన్నాయి, కానీ, చమత్కారమో వ్యంగ్యమో లేవు. కల్పించినవి కాక వాస్తవ ఘటనలే ఈ కథల్లో ఉన్నాయి. కథనరీతి అత్యధికం ఉత్తమ పురుషలో ఆత్మాశ్రయంగా ఉన్నది. కథలో గాని, గల్పిక, మినీకథల్లో గాని సాధారణంగా సన్నివేశం వరకే కథాకాలం పరిమితమవుతుంది. కానీ ఈ కథల్లో కథాకాలంలో దీర్ఘత, గమనమూ ఉన్నాయి. తలపోత లాగా, జ్ఞాపకాల పరామర్శ లాగా, గతంలోకి ప్రయాణం లాగా అనిపించే కథనం, కథనాన్ని అంతర్లీనంగా నడిపించే దృక్పథమూ ఉన్నాయి. గతం, వర్తమానాల మధ్య పోలిక, సారూప్యాల మధ్యనే కొట్టొచ్చినట్టు కనిపించే వైరుధ్యం, చిరు విజయాలకీ, చిన్న ఆనందాలకీ, సహజ లోకజ్ఞానానికీ, లోకంలో ఇంకా మిగిలి ఉన్న సహృదయతకీ పులకించిపోయే హృదయం, ఎక్కడైనా చూడగలిగిన ఆశ – ఈ కథల్లో ఆశ్చర్యపరిచే గుణాలు. అందుకే వీటిని గల్పికలనలేము. మినీకథలూ అనలేము. కొసమెరుపు కథలు కావుకానీ, మెరుపు కథలే. మిరుమిట్లుగొలిపే కథలే. రచయిత మనమధ్య కూర్చుని చెబుతున్న ముచ్చట్లే. అనుభవాల నుంచి సార్వత్రిక విలువలను మథించే అవలోకనాలే.

బ్లాగ్ వేదిక స్వభావం ఈ కథల రూపసారాలను అర్థం చేసుకోవడానికి కొంత పనికివస్తుంది. ఇంటర్నెట్ అన్నది మనుషుల మధ్య కమ్యూనికేషన్‌లను కొత్త దశకు తీసుకువెళ్లిన సాంకేతిక అద్భుతం. ప్రపంచీకరణలోని మంచిచెడులకు వాహికగా అది పనిచేస్తున్నది. కాయితాల మీద అచ్చయ్యే పత్రికలకున్న స్థల పరిమితిని ఇంటర్నెట్ అపహాస్యం చేస్తుంది. ప్రచురణకు అపారమైన స్థలాన్ని అందిస్తుంది. అదే సమయంలో ఇంటర్నెట్‌కు వేగం ఒక ప్రధానమైన చోదకవిలువ. స్థలానికి పరిమితి లేని చోట, క్లుప్తత ప్రధానంగా ఉండే రచనారూపాలు అవతరించడం ఒక విచిత్రం. లిఖిత సంప్రదాయానికి చెందిన సుదీర్ఘరచనలు, అపారమైన సమాచార సంపుటులు నెట్‌లో ఉన్నాయి కానీ, నెటిజన్స్ అని మనమెవరిని అంటామో వారు సామాజిక మీడియా ద్వారా క్లుప్తతనే సాధన చేస్తున్నారు. స్పెల్లింగులు సరే, చివరకు వాక్య నిర్మాణం కూడా శిథిలమై కొత్త క్లుప్తభాష అవతరిస్తున్నది. బ్లాగ్ వేదికలలో కూడా చిట్టి పోస్టింగులు, పొట్టి కవితలే అధికంగా కనిపిస్తాయి. రచయితలు కావాలన్న సంకల్పం, సాధన లేనివారిని సైతం బ్లాగ్ వేదికలు రచయితలను చేశాయి. కొత్త ప్రపంచాలను, పదజాలాలను, వ్యక్తీకరణలను అక్షరాల్లోకి ప్రవహింపజేశాయి. దినచర్యను రాసుకోవడం, ఎప్పుడేది తోస్తే అది రాసి పంచుకోవడం, ఎవరో రాసి తమకు నచ్చినవాటిని తిరిగి పబ్లిష్ చేసుకోవడం – బ్లాగ్‌లో చాలా చాలా చేయవచ్చు. బ్లాగ్ అంటే ఒక వ్యక్తి పత్రిక. ఆ పత్రికకు ఆ వ్యక్తే కర్తా, కర్మా, క్రియా, రచయితా, ఎడిటరూ కూడా. రచయితా రచనా ప్రక్రియా పత్రికా – వంటి మాటల నిర్వచనాలనే బ్లాగ్ మార్చేసింది. బ్లాగ్ ద్వారా కాబట్టే, మల్లీశ్వరి ఈ కథలను ఇట్లా రాయగలిగారు. తన రచనను యథేచ్ఛగా తనే ప్రచురించుకుని, తారసపడిన పాఠకులతో సంభాషించగలిగే అవకాశాన్ని, అనేకానేక ఇతర బ్లాగర్ల వలెనే, ఆమె సృజనాత్మకంగా వినియోగించుకున్నారు. అదే సమయంలో బ్లాగ్ వేదికకు

ఉన్న అలవోకతనం, బిగువులేనితనం మల్లీశ్వరి కథల్లో కూడా అక్కడక్కడా మనల్ని పలకరిస్తాయి. ఎంచుకున్న అంశంలో ఉత్తమ బ్లాగ్ కథ కావడానికి ఆస్కారం ఉన్నప్పటికీ, దాన్ని చివరిదాకా నిర్వహించడంలో సహనం లోపించిన ఒకటి రెండు సందర్భాలను పాఠకులు సులువుగానే గుర్తుపట్టగలరు. అయితే, అన్ని కథల్లోనూ ఆ లోపం జరగకుండా మల్లీశ్వరికి ప్రధాన స్రవంతి కథారచయితగా ఉన్న అనుభవం రక్షించిందనుకుంటాను.

బ్లాగ్‌ను అవతరింపజేసిన ప్రపంచీకరణ – ఇంకా చాలా వాటిని కల్పించింది. కొత్తరకం కమ్యూనికేషన్లను నిర్మించే క్రమంలో అనేక సంప్రదాయ సంబంధాలను అది విధ్వంసం చేసింది. ధనప్రవాహానికి మహా రహదారులు వేస్తూ, హృదయ కవాటాలను సంకుచితం చేసింది. గ్రామాన్ని శిథిలం చేసి, పట్టణాలకు ఎరువు పోసింది. ప్రేమల్ని చంపి వాంఛల్ని ప్రతిష్ఠించింది. విజయాన్ని ఒక ఉన్మాదంగా తీర్చిదిద్దింది. ఎల్లలు లేని మహమ్మారిని సృష్టించింది. కాసుల గలగలలూ ఆత్మహత్యల విలవిలలూ కలగలసిపోయిన ఈ విధ్వంస ఉత్సవంలో సగటుమనిషి అనాథ అయిపోయింది.

తనను తాను రక్షించుకోవాలనుకునే మనిషి అయినా, ప్రపంచమైనా ఈ ఉధృతిలో కొట్టుకుపోదు. తనకు తానై యాంటీబాడీస్‌ను సృష్టించుకుంటుంది. అసంబంధాన్ని సంబంధంతో, విధ్వంసాన్ని నిర్మాణంతో, శూన్యభవితవ్యాన్ని గత వైభవంతో పూరించుకోవడానికి ప్రయత్నిస్తుంది. అన్ని రకాల ఉనికిలను రద్దుచేసి ఒక మహాప్రవాహంలో అనామకం చేసే ప్రయత్నాన్ని అస్తిత్వాల ఉధృతితో ఎదుర్కొంటుంది. ఆ ప్రయత్నాన్ని మల్లీశ్వరి కథలు ప్రతిభావంతంగా ప్రతిఫలించాయి. ఈ పుస్తకంలోని మొదటి కథే – మనుషులు గెలుచుకోవలసినది హృదయాలని చెబుతుంది. ఏ ప్రలోభాలూ లేనివీ ఎపుడూ తెరచివుంచేవీ అయిన పసి, ముసలి హృదయాలను ప్రేమించడం గురించి చెబుతుంది. ధనవ్యవస్థ ఎగదోసే అరిషడ్వర్గాలకు యవ్వనం కూడా ఎట్లా లొంగిపోయిందో సూచిస్తుంది. ఎడబాటు ఒక అలవాటుగా మారిన మనిషి, స్వచ్ఛమైన స్వచ్ఛందమైన అనుబంధానికి కూడా ఎట్లా భీతిల్లుతాడో ఇంకో కథ చెబుతుంది. అమర్చిపెట్టిన హంగులతో అద్భుతాలు సాధించడం కంటె, ముళ్లూరాళ్లూ నిండిన బాటలో చేసిన ప్రయత్నమే గొప్ప విజయమని మరో కథ చెబుతుంది. చేతులారా మంచినీళ్ళను మురికి చేసుకుని అక్వాగార్డ్‌తో వడబోసుకుంటున్న తరానికి ఒక కథలో మామ్మ చిల్లగింజ చేసే చమత్కారం చెబుతుంది. స్టార్టర్స్ మెయిన్‌కోర్స్ డిజర్ట్స్‌తో మూసపోసిన భోజనాలకు, నాన్న చేతి ఆవకాయ ముద్దను పోటీగా మరో కథ నిలబెడుతుంది. సమాజ రంగస్థలంలో జరుగుతున్న అస్తిత్వ సంచలనాలు తరగతి గదిలో ఎలా ప్రతిఫలిస్తాయో, హైవేలు తీసుకువచ్చే అభివృద్ధి దళితవాడలో ఎంత క్రూరంగా అనువదితమవుతుందో, నాయనమ్మలూ బామ్మల లోకజ్ఞానం పెద్ద చదువులను ఎంతగా అపహాస్యం చేస్తుందో మల్లీశ్వరి కథలు ఆశ్చర్యపరుస్తూ చిత్రించాయి. ప్రపంచగమనాన్ని అర్థం చేసుకోవడాన్ని, సమాజంలో విలువలు తలకిందులు కావడాన్ని కథనం చేయడానికి పెద్దకేన్వాసు, భారీ సన్నివేశాలు అక్కరలేదని. ఇంటిముంగిట నిలబడి, పెరటితోటలో తిరుగుతూ, క్లాస్‌రూమ్‌లో పాఠం చెబుతూ, అక్కచెల్లెళ్లతో కలసి భోజనానికి కూర్చునీ, రోడ్డు దాటుతూ, స్టాఫ్ రూమ్‌లో కబుర్లు చెబుతూ – లోకపు పోకడని అర్థం చేసుకోవచ్చునని మల్లీశ్వరి కథలు నిరూపిస్తాయి. వ్యత్యాసాలను, అంతరాలను, వైరుధ్యాలను గుర్తించే చూపు ఉండాలే కాని, సమాజ చలనానికీ, గమనానికి జీవిత నిఘంటువు లోనే అర్థాలు దొరుకుతాయని ఈ కథలు చదివినప్పుడు అనిపిస్తుంది. అవగాహనతో, దృక్పథంతో, జ్ఞానంతో అనుభవాన్ని రంగరించి రచయిత ఈ కథలను చెప్పారు కానీ, పాఠకులకు మాత్రం కామన్‌సెన్స్‌తో చెప్పినట్టే అనిపిస్తుంది. రచన ప్రయోజనం రీత్యా ఇది గొప్ప ఫలితమే. ఒక ఉదంతంతో, ఒక చమత్కారంతో, ఒక పిట్టకథతో పెద్ద పెద్ద వాదనలను పూర్వపక్షం చేసే మాటకారిలాగా రచయిత కనిపిస్తారు. ఆ పరిమితి బ్లాగ్ వేదికగా అవతరించిన కథదే తప్ప, రచయితది కాదు. గాఢత సాంద్రత సంక్లిష్టత తప్ప మరిదేన్నీ జీర్ణం చేసుకోలేని ప్రత్యేకవర్గం పాఠకులకు ఈ కోవ రచనలు బుద్ధిరంజకంగా ఉండక పోవచ్చు. వారి కోసం వేరే రచనలు చేయండి, మల్లీశ్వరీ!

ఈ కథలు మనల్ని ఒప్పించి మెప్పించేందుకు రాసినవి కావు. ఆశ్చర్యపరిచి, నైతిక తీక్షణతతో మనల్ని తబ్బిబ్బు పరచేందుకు రాసినవి. సహజీవనం, పంచుకోవడం, మంచితనం, సౌకుమార్యం, ధర్మాగ్రహం, ఆత్మగౌరవం – వంటి విలువలకోసం రాసినవి. ఉదాహరణకు – సౌందర్యానికి, సంపన్నతకీ మల్లీశ్వరి ఈ కథల్లో ఇచ్చిన దృష్టాంతాలనే చూడవచ్చు. తమకున్నదంతా యిచ్చి సంతోషపెట్టాలనే నిర్మలత్వంతో పిల్లలు అందంగా ఉంటారని, ఆత్మాభిమానంతో రగిలిపోయే దృఢమైన వెన్నెముకతో సొగసుగా ఉంటారని,

ఎత్తైన గడ్డివాముల మీంచి, గోడల మీంచి కించిత్తు కందకుండా కిందికి దూకేసి బంతిలా లేచి నిలబడే విజ్జిలు అల్లరికి అదుగుజాడలని, డబ్బులకి కాకుండా ఊరికే అవీ ఇవీ ఇవ్వబోయిన సాయిబుకొట్టు బూబమ్మలు సౌందర్యవతులని, చీర కుచ్చిళ్ళు పైకిదోపి, పాత గుడ్డతో సుమ్మ చుట్టి దాని మీద పాలబిందె పెట్టి ఎడమ చేత్తో బిందె పట్టుకుని వచ్చే వాడుక పాల రాజేశ్వరులు అమృతం పంచడానికి వచ్చిన జగన్మోహినులని, నాన్న భుజం మీదికి ఎక్కి ఇల్లంతా తిరిగే ఆడపిల్లలు యువరాణులని – మల్లీశ్వరి అభివర్ణిస్తారు. ఇందులోని కథలన్నిటి లోనూ ఉండే లాలిత్యమూ, లేతదనమూ మధ్య ఈ వర్ణనలు మార్దవానికి మాధుర్యాన్ని జోడిస్తాయి. మానవ సంబంధాల సున్నితత్వాన్నీ, వాటిని ప్రభావితం చేసే బాహ్య పరిస్థితుల కర్కశత్వాన్ని వివరిస్తున్నప్పుడు, రచయిత వేదన పడతారు తప్ప వీరంగం వేయరు.

ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా స్త్రీలు తమ సామర్థ్యాన్ని, ప్రతిభను చూపించగలరని, చిన్న అవకాశం వచ్చినా వారు తమ ప్రత్యేకతను, ఉనికిని చాటుకోగలరని, కాసింత మంచి ఆసరాతో వారు తమ కోర్కెలను సొంతంగా, విశాలంగా పరచగలరని, బాల్యంలో ఎంతో చురుకుదనం చూపించిన ఆడపిల్లలు వివాహ వ్యవస్థలో భాగమైన వెంటనే అణగారిపోతారని – చెప్పే కథలు ఈ పుస్తకంలో ఉన్నాయి. నలభై కథల్లో సగానికి పైగా స్త్రీల అస్తిత్వ చైతన్యాన్ని వ్యాఖ్యానించినవే. కథల్లో పాతికదాకా జ్ఞాపకాలను మననం చేసుకుంటూ వర్తమానంతో పోల్చినవే. అయినంతమాత్రాన గతమెంతో ఘనకీర్తి అని చెప్పిన కథలు కావవి. వర్తమానప్రపంచం దేనికోసం బెంగపడుతుందో, వాటి ఆనవాళ్లు గతంలో ఉన్నప్పుడు పలవరించడం ఈ కాలపు చైతన్యంలో భాగం. బెంగ నిన్నటి కోసం కాదు. రేపటికోసమే. ఆ మానవ సంబంధాల కోసం, ఆ ప్రాకృతిక జీవనం కోసం బెంగ. అంతేతప్ప నాటి మూఢత్వాలనో, అమానుషత్వాలనో పలవరించడం కాదు.

మనచుట్టూ ఉండే మనుషులను, మనకెదురయ్యే అనుభవాలను తీసుకుని, మెల్లగా మన మనసుని తట్టి, ఒక సన్నటి వెలుగును ప్రసరించిన ఈ కథలు ఈ కాలపు కథలు సాంకేతికంగా, రాజకీయంగా, రూపంరీత్యా అన్ని రకాలుగా.

**-కె. శ్రీనివాస్**

నవంబర్ 29, 2011 ప ర్ స్పె క్టి వ్స్

# ఈ మధ్య నేను కొల్లగొట్టిన హృదయాలు

ఎపుడు అంతర్ముఖులమైనా మనకు సంతృప్తినిచ్చే వాటిలో ముఖ్యమయినవి మనం గెల్చుకున్న హృదయాలే. ఈ మధ్య తరచి చూసుకున్నపుడు నా మనసుకి వెన్నెల పొడినద్దిన రెండు హృదయాలు కన్పించాయి. గెలుచుకున్న హృదయాలను తలుచుకోవడం చాలా బావుంటుంది కదా!

ఓ రోజు కాలేజీకి వెళ్ళడం కోసం రోడ్డు దాటడానికి నిల్చున్నాను. ట్రాఫిక్ ఎక్కువగా వుంది. నేనలా ఎదురు చూస్తుండగా నా చేతిని ఎవరో స్పృశించినట్లయింది. తిరిగి చూశాను. తొమ్మిదేళ్ళ పాప.

చిరుగులు పట్టిన దుస్తులు, అతుకులతో ఆకారం మారిన స్కూల్ బాగ్, బాగా దువ్వి రిబ్బన్లతో పైకి కట్టిన రెండు జెడలు.

మొహమాటంగా నా వంక చూస్తూ రోడ్డు దాటివ్వమన్నట్టు చూసింది. ఆ పాప చేతిని నా చేతికి చుట్టుకున్నాను. రోడ్డు దాటగానే ఓ బుల్లి సిగ్గునవ్వు నా మీదికి విసిరి చక్కాపోయింది.

నా కాలేజీ, ఆ పాప గవర్నమెంట్ స్కూలు వదిలే సమయం ఒకటే. మళ్ళీ సాయంత్రం నన్ను చూసి ఈసారి కొత్తగా వచ్చిన హక్కుతో ఛెంగున గెంతుతూ నా దగ్గరికి వచ్చి, అడగాల్సిందేం లేదన్నట్లు దర్జాగా చెయ్యి పట్టేసుకుంది.

రోడ్డు దాటేసి టాటాలు చెప్పుకుని వెళ్ళిపోయాం. పది రోజుల్లో అయిదారు సార్లు యిలా జరిగేసరికి స్నేహం ప్రారంభమయింది. రోడ్డు దగ్గరికి రాగానే రోజూ నేను దిక్కులు చూడటం, నేనొచ్చేవరకూ వెళ్ళకుండా ఆ పాప ఎదురు చూడటంతో హృదయాలు యిచ్చి పుచ్చుకునే ప్రక్రియ కూడా మొదలయింది.

ఓ రోజు సాయంత్రం రోడ్డు దాటినా తను నా చెయ్యి వదలకుండా బజ్జీల బండి దగ్గరకి తీసికెళ్ళి గుప్పెట తెరిచి అయిదు రూపాయల నాణెం చూపించి, "మధ్యలో ఆకలేసినా ఏం కొన్లేదు....మనిద్దరం కలిసి తినొచ్చని" అంది.

పిల్లలు ఎంత గొప్ప దాతలు!

తమకున్నదంతా యిచ్చి సంతోషపెట్టాలనే నిర్మలత్వంతో ఎంత అందంగా వుంటారు! ఆ ధనవంతురాలి ప్రేమని ఆనందంగా స్వీకరించాను.

ఆ తర్వాత నుంచీ మా హృదయాలను వ్యక్తీకరించడంలో కొత్తదనపు అన్వేషణ తమాషాగా వుంటుంది. ఓ రోజు నేను తన భుజం చుట్టూ చెయ్యి చుట్టి దాటిస్తే, మరో రోజు తను నా నడుం చుట్టూ చెయ్యి చుడుతుంది. ఓ రోజు తన స్కూల్ బాగ్ నేను మోస్తే, నా హేండ్ బేగ్ తను పట్టుకుంటుంది.

ఇక ఏదో ఒక రోజు ఆ పాప తన లేత పెదాలతో నా చేతులకో, బుగ్గలకో ప్రసాదించే గొప్ప కానుక కోసం ఉద్వేగంగా ఎదురు చూస్తున్నాను.

రెండు నెలల కిందట విజయనగరం మీటింగ్‌కి వెళ్ళినపుడు కొంచెం సమయం దొరగ్గానే చాగంటి తులసి గారింటికి వెళ్ళాను.

చాసో భార్య తొంభై సంవత్సరాల పండిన జాంపండు. తెల్లగా సన్నగా కాస్తంత పొట్టిగా మాట్లాడుతున్న పంచదార చిలకలా కన్పించారు. చూడంగానే ముద్దొచ్చి దగ్గరగా వెళ్ళి మోకాళ్ళ మీద కూర్చుని ఆమె ఒళ్ళో చేతులు వేయగానే నా బుగ్గలు తడిమి నా కోసమే ఎదురు చూస్తున్నట్లు గలగల మాట్లాడటం మొదలుపెట్టారు.

నా చూపుని ఆమె మొహం మీద నుంచి పక్కకి మరలనివ్వని కనికట్టు మాటల విద్య తెలిసిన ఆ గువ్వపిట్ట 'నీపేరు నాకు నచ్చింది' అంటూ పదిసార్లు పిలిచి సంతోషపడ్డారు.

మీటింగ్ సమయం అవుతుందని అయిష్టంగా బయలుదేరుతుంటే చేతులు పట్టుకుని వదలకుండా సవరదీస్తూ 'మళ్ళీ ఎప్పుడు వస్తావో చెపితే గానీ వదల'నని ఒకటే పట్టుబట్టారు.

తులసిగారొచ్చి చేతులు బలవంతంగా విడదీసి 'మీటింగ్ టైమవుతోంది వెళ్ళనివ్వు' అని చిన్నగా కోప్పడ్డారు. రెండు వారాల్లో తప్పకుండా వస్తానని చెప్పి రెండు నెలలయినా



వెళ్ళకపోయేసరికి ఆమె నామీద శాశ్వతంగా అలిగి వెళ్ళిపోయారు. నేను పొందిన వెంటనే కోల్పోయిన ఆ హృదయం నన్ను నాలుగు రోజులుగా వెంటాడుతోంది.

ఎపుడూ తెరిచి వుంచేవీ, గొప్ప సంతృప్తి నిచ్చేవి, పెద్దగా ఏమీ ఆశించనివీ అయిన ముసలి, పసి హృదయాలను మనం నిర్దాక్షిణ్యంగా తొక్కుకుంటూ....సులువుగా తెరవబడనివీ, ప్రలోభపెట్టేవీ, మనసుని కష్టపెట్టేవీ అయిన డబ్బు, అధికారం, యవ్వన హృదయాల లోతుల్ని మధించాలని తపించిపోతుంటాం. కొంచెం బాలెన్స్ చేసుకుందామా?

*26 జనవరి 2010*

# నా మాదిగ గూడెం యాత్రా విశేషాలు

**ఈ** మధ్య పాత డైరీలు తిరగేస్తుంటే మూడేళ్ళ కిందట ఎండ్లూరి సుధాకర్ గారికి రాసిన ఓ ఉత్తరంలోని కొన్ని భాగాలు కన్పించాయి.

అందులో కొన్ని అంశాలు మిత్రులతో పంచుకోవాల్సినవిగా తోచాయి. 2005, 2006 సంవత్సరాల్లో నేను జెండర్, కాస్ట్ వివక్ష, అణచివేతలు కలిస్తే వచ్చే సంక్లిష్ట సందర్భాలను గురించి రెండంచుల కత్తి, పెత్తనం అనే కథలు రాసాను.

దళిత స్త్రీ సమస్యల పట్ల నాకున్న సహానుభూతిని ఆ కథల్లో వ్యక్తం చేశాను. నిజానికి ఆ కథలు రాసాక వాటిపై వచ్చిన చర్చల మూలంగా కూడా నేను కొంత నేర్చుకున్నాను.

ఆ రోజుల్లోనే ఓ సారి సెలవుల్లో విశాఖ నుంచి నేను పుట్టిన పెరిగిన గ్రామానికి వెళ్ళాను. కొత్తగా తెలుసుకున్న జ్ఞానంతో వ్యక్తుల మూలాల్లో వుండే వైరుధ్యాల్ని ఆసక్తిగా పరిశీలిస్తూ వుండేదాన్ని. చిన్నపుడు నిషిద్ధ స్థలంగా నూరిపోయబడిన మా వూరి చివరి మాదిగగూడెం ఈసారి చేతులు చాచి ఇచ్చిన ఆహ్వానం మీద నేను గూడెం వైపు అడుగులేసినపుడు వూరు వూరంతా ముక్కున వేలేసుకుంది.

గూడెం సంబరంగా ఎదురొచ్చి కావలించుకుంది. మనం ఎవరి వేపు ఉండాలో అప్పటికైనా తెలుసుకోగలిగినందుకు సంతోషించాను. నేనక్కడ గడిపిన ఒక పూటలో చాలా విషయాలు గ్రహించాను. కానీ ఒక విషయం ఇప్పటికీ నన్ను ఆశ్చర్యపరుస్తూనే వుంది.

మనం నమ్మే ప్రతీ విలువా ఎదుటి వారికి అంతే స్థాయిలో విలువైనదై ఉండాలనుకోవడం ఎంత అసంబద్ధమో ఓ సామాన్య దళిత స్త్రీ నుంచి గ్రహించాను నేను.



ఆ గూడెంలో మగవాళ్ళు సారాయికి, పేకాటకి బానిసలై కూలి డబ్బంతా తగలేస్తుంటే...స్త్రీలు తమని తాము పోషించుకోడమే కాక, మొగుడిని పిల్లల్నీ పోషిస్తూ అష్టకష్టాలు పడుతున్నారు.

ఇదంతా పంటల రోజుల్లో... మరి కూలి పనులు లేని రోజుల్లో? ఆ ప్రశ్నే అడిగాను.

దానికి కాసేపు నసిగిన మీదట ఇద్దరు ముగ్గురు ఇచ్చిన సమాధానం –

"రేత్రిల్లు అడ్డరోడ్డు దగ్గరున్న ధాబాకి పోతాం" అని.

నేను నిలువునా వణికిపోయాను. ఒకామె చెయ్యి పట్టుకుని "వద్దొద్దు... చాలా తప్పు... అట్లా చేయకూడదు, జబ్బులొచ్చి చచ్చిపోతారు" ఆందోళనగా అన్నాను.

అదెంత తప్పో, ప్రమాదమో చెప్పి వాళ్ళని ఎట్లాగైనా సంస్కరించాలన్న ఉద్వేగం కలిగింది.

అపుడామె నా చెయ్యి సున్నితంగా విడిపించుకుంటూ నిర్వికారంగా అంది కదా "ఈ రోజు బతకాలంటే ఈ రోజే తినాలి కదమ్మా" అని. విలువల్ని నడిపించే సూత్రాలని ఆ బోధకురాలు ఒక్క ముక్కలో చెప్పాక నా మరుగుజ్జుతనానికి సిగ్గు పడ్డాను.

*5 మార్చి 2010*

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=511**